క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్

నరసన్నపేట: కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, దీనిని కక్షిదారులు వినియోగించుకోవాలని స్థానిక సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. శనివారం కోర్టు వద్ద సమావేశం నిర్వహించారు. ఈ నెల 13న నరసన్నపేటలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. క్రిమినల్, సివిల్ కేసులు అధికంగా పరిష్కారమయ్యేలా చూడాలని న్యాయవాదులు, పోలీసులకు సూచించారు. పోలీసులు, న్యాయవాదులు ఇరు పక్షాల వారితో సంప్రదింపులు జరిపి లోక్ అదాలత్‌కు తీసుకురావాలన్నారు. కేసులను సామరస్య పూర్వకంగా రాజీ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పంట పరిశీలన



నీటమునిగి పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

పాతపట్నం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కాపుగోపాలపురం, పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం సమీపంలో గుమ్మగెడ్డకు గండి పడడంతో వరి పంట పొలాలు నీటమునిగాయి. శనివారం పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వెనుక ఉన్న వరి పంట పొలాలను తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎంపీడీఓ పి.చంద్రకుమారి, ఏఓ పి.కిరణ్ వాణి రైతులుతో కలిసి పరిశీలించారు. వర్షం తగ్గడంతో నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులుకు ఏఓ సూచించారు.

ఎరువులు సక్రమంగా పంపిణీ చేయాలి



గొటివాడలో ఎరువుల పంపిణీ రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

జలుమూరు: ఎరువుల పంపిణీ సక్రమంగా జరగాలని ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ అన్నారు. శనివారం గొటివాడలో రైతులతో మాట్లాడారు. రైతులుకు ఎరువులు ఇవ్వకుండా పక్కదోవపడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సైరిగాం, జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. మందులు నిల్వలు, రికార్డులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. శ్రీకాకుళం ఆర్డీఓ కె.సాయి ప్రత్యూష, తహసీల్దార్ జెన్ని రామారావు, మెడికల్ అధికారులు పి.గురునాథరావు, గొలివి సుజాత, ఏఓ కింజరాపు రవి పాల్గొన్నారు.

గౌరమ్మ మృతికి పలువురి సంతాపం



బొడ్డేపల్లి గౌరమ్మ (ఫైల్)

ఆమదాలవలస: సమితి ప్రెసిడెంట్, మున్సిపల్ ప్రథమ చైర్మన్ బొడ్డేపల్లి వెంకట నరసింగరావు (వెంకటబాబు) సతీమణి, మాజీ ఎంపీపీ బొడ్డేపల్లి గోవింద గోపాల్ మాతృమూర్తి గౌరమ్మ (92) శుక్రవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు పట్టణంలోని బొడ్డేపల్లి రాజగోపాలరావు నగర్‌లో శనివారం ఉదయం నిర్వహించారు. ఈమె దివంగత మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు చిన్న సోదరుడి సతీమణి, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతికి చిన్నత్త. గౌరమ్మ మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి



గాయపడిన మహాలక్ష్మి

కొత్తూరు: మండలంలోని కడుము కాలనీకి చెందిన కిల్లారి మహాలక్ష్మిపై ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న బూరాడ సంజీవరావు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ శనివారం తెలిపారు. మహాలక్ష్మి ఇంటిలో, ఇంటి ముందు వాకిలి తుడిచిన చెత్తను ఇంటి ఎదురుగా ఉన్న సంజీవరావు ఇంటి వైపు వెస్తున్నావంటూ నిత్యం ఇద్దరు మధ్య తగాదా జరిగేదని ఎస్ఐ చెప్పారు. ఇంటి ముందు తుడుచిన చెత్త ప్రతిసారీ వేస్తే నీ అంతు చూస్తానని మహాలక్ష్మికి సంజీవరావు నిత్యం బెదిరించేవాడన్నారు. ఎప్పుడు మాదిరిగా శనివారం మహాలక్ష్మి ఇంటి ముందు చెత్తను తుడుస్తుండగా ఆమెపై సంజీవరావు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన మహాలక్ష్మిని కొత్తూరు సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మహాలక్ష్మి భర్త వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ సంఘటనపై శనివారం రాత్రి టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ వివరాలు నమోదు చేశారు.

కూరగాయల సాగు..
బహు బాగు



జాడుపల్లిలో పందిరి సాగు ద్వారా పండిస్తున్న కూరగాయలు



వంశధార నదీతీరంలో పండిస్తున్న వంగ పంట



మెళియాపుట్టి గ్రామంలో పండిస్తున్న బెండ పంట

- పాతపట్నంలో విస్తారంగా సాగు
- పందిరి సాగుకు రైతుల ఆసక్తి
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మెళియాపుట్టి: పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన రైతులు విస్తారంగా కూరగాయలు సాగు చేస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లో కూడా అత్యుత్తమంగా లాభాలు పొందుతున్నారు. ముఖ్యంగా వంగ, టమాటా, బెండ తదితర పంటలు పండిస్తున్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో రాగులు, జొన్నలు, సారికంద, చెరుకు, ఉలవ, వేరుశనగ ఇతర పంటలు సైతం పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఫలితంగా నియోజకవర్గం వ్యాప్తంగా ఏ మండలంలో చూసినా 21,373 ఎకరాల్లో కూరగాయల సాగుతో పచ్చదనం కనిపిస్తోంది.

నీటి సదుపాయం ఇలా...

నియోజకవర్గంలో కూరగాయల పంటలకు వంశధార, మహేంద్రతనయ నదుల నుంచి పుష్కలంగా నీరు అందుతుంది. మెళియాపుట్టి, పాతపట్నం మండలాల రైతులకు మహేంద్రతనయ నది నీరు ఉపయోగపడుతుంది. అదేవిధంగా కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు వంశధార నీరు అందుతుంది. దీంతో రైతులు ఖరీఫ్‌లో సైతం కూరగాయల సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్నారు. ఉద్యానవన శాఖ అధికారులు మరింత సహకారం అందిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుందని చెబుతున్నారు.

సాగు విస్తీర్ణం ఇలా...	మండలం	పాతపట్నం	మెళియాపుట్టి	హిరమండలం	కొత్తూరు	ఎల్.ఎన్. పేట	మొత్తం
	సాగు విస్తీర్ణం(ఎకరాల్లో..)	4,265	5,250	3,108	5,800	2,950	21,373

పనిముట్లు అందించాలి



కూరగాయలు సాగు చేయడానికి అవసరమైన పనిముట్లు రాయితీపై ప్రభుత్వమే అందిస్తే బాగుంటుంది. ఖరీఫ్, రబీ తేడా లేకుండా కూరగాయలు సాగు చేస్తున్నాం. లాభాలు బాగానే వస్తున్నాయి. మా గ్రామంలో జరిగే సంతలోనే కూరగాయలు అమ్ముకుంటున్నాం. ప్రభుత్వం నుంచి మరింత సహకారం కావాలి.

– కుమారి పాత్రో, మెళియాపుట్టి

పందిరి సాగుతో లాభాలు



సుస్థిర వ్యవసాయ విధానంలో పందిరి విధానంలో కూరగాయలు సాగు చేస్తున్నాం. అధిక దిగుబడులు పొందుతున్నాం. తాజా కూరగాయలకు చాలా డిమాండ్ ఉంది. మేము పండించే కూరగాయలు సుదూర ప్రాంతాలకు సైతం వెళ్తున్నాయి. వరుస పాదుల విధానంలో కూడా కూరగాయల పంట లాభదాయకమే.

– ఆసరి అప్పలమ్మ, నేలబొంతు గ్రామం

సహకారం అందిస్తున్నాం



కూరగాయల రైతులకు సహకరించేలాగా క్షేత్ర స్థాయి సిబ్బంది పని చేస్తున్నారు. అధిక దిగుబడులు సాధించడానికి యాజమాన్య పద్ధతులు పాటించాలి. అదేవిధంగా సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడులతో పాటు, ఆరోగ్యదాయకమైన కూరలు లభిస్తాయి. పందిరి సాగుపై రైతులు దృష్టి సారించడం శుభసూచికం.

– దానకర్ణుడు, వ్యవసాయ అధికారి, మెళియాపుట్టి

మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేయడం సరికాదు



మాట్లాడుతున్న బొడ్డేపల్లి రమేష్‌కుమార్

ఆమదాలవలస: పీపీపీ విధానంలో రాష్ట్రంలోని పది మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌పరం చేయడం సరైనది కాదని, కూటమి ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆమదాలవలసలో విలేకర్లతో మాట్లాడారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ఉన్నత ఆశయంతో పేద విద్యార్థుల కలలను సాకారం చేయడానికి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారన్నారు. కూటమి సర్కారు వాటిని ప్రైవేట్‌పరం చేస్తోందన్నారు. మరోవైపు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకువచ్చిన ఆరోగ్యశ్రీని బీమా సంస్థలకు కట్టబెడుతూ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తున్నారని మండిపడ్డారు. మూడు సార్లు ముఖ్యమంత్రి, 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అంటూ చెప్పుకుంటున్న చంద్రబాబు.. ప్రజల ఆస్తులను పప్పూబెల్లాల మాదిరిగా ఆయన అనుయాయులకు దోచిపెడుతున్నారన్నారు. పేద విద్యార్థులంతా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

యూరియా కొరత వాస్తవమే..!

- మండల సమావేశంలో ఎమ్మెల్యే రమణమూర్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు: యూరియా కొరత ఉందని, రైతులు అవస్థలు పడుతున్న మాట వాస్తవమేనని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పలు దేశాల్లో యుద్ధాలు జరగడం వల్ల ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. ఏప్రిల్, జూన్ నెలల్లో ఎరువులను నిల్వ చేయకపోవడం వల్లే ఇబ్బంది పడుతున్నామన్నారు. అయినా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసి యూరియా కొరతను అధిగమించేందుకు ప్రత్యామ్నాయం చూస్తోందన్నారు. ఎరువుల కొరత ఒక వైపు ఉంటే, మరో వైపు శ్రీముఖలింగం, పాగోడు వీపీఏలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. ఎరువులకు సంబంధించిన సమాచారాన్ని కనీసం ప్రజాప్రతినిధులుగా తెలియజేకుండా చేతివాటం ప్రదర్శిస్తున్నారని, తాము ఎమ్మెల్యే మనుషులం అంటూ మాట్లాడడం ఎంతవరకు సమంజసమని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఎరువుల విక్రయం పారదర్శకంగా జరగాలని, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్షించి ఈ సమస్య మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. వంశధార కాలువల ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఎంపీటీసీ హరిప్రసాద్ తెలిపారు. వివిధ శాఖలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, జేఈ శ్రీధర్, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, సీడీపీఓ వంశీప్రియ, జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి గొలివి సుజాత, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి



కొత్తూరు: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



హిరమండలం: ఎల్.ఎన్.పేటలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

హిరమండలం/కొత్తూరు: రైతులకు అవసరమైన యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎల్.ఎన్.పేట మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు, కొత్తూరు మండల కమిటీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ అన్నారు. శనివారం ఎల్.ఎన్.పేట, కొత్తూరు మండల కేంద్రాల్లో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ అధిష్టానం పలుపుమేరకు ఈ నెల 9న రెవెన్యూ డివిజన్ టెక్కలిలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎల్.ఎన్.పేట మండల నాయకులు శిమ్మ సాంబశివరావు, రెడ్డి రామారావు, లోచర్ల మల్లేశ్వరరావు, గుజ్జల యోగేశ్వరరావు, రెడ్డి లక్ష్మణరావు, కొత్తూరు మండల నాయకులు వనము లక్ష్మీనారాయణ, ధర్మరావు, సవర రమేష్, శంకరరావు, పోలయ్య, నగేష్, దూలి అప్పన్న పాల్గొన్నారు.

యూరియా సక్రమంగా అందివ్వాలి

నరసన్నపేట: మండలంలో పలు రైతు సేవా కేంద్రాలకు యూరియా వచ్చిందని, రాజకీయ ప్రమేయం లేకుండా రైతులకు సరఫరా చేయాలని వీఏఏలకు ఈఆర్వో జయదేవి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు ఆర్ఎస్‌కేలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోమర్తికి 200 బస్తాల యూరియా, జమ్ముకు 221, కామేశ్వరిపేటకు 440, కరగాం 200 బస్తాలు, తెలగవలసకు 100, చిక్కాలవలసకు 200, ఉర్లాంకు 222 బస్తాల యూరియా వచ్చిందన్నారు. రైతులు కూడా సహకరించాలని, అందరికీ యూరియా అందిస్తామన్నారు. ఈఆర్వోతోపాటు ఏఓ సూర్యకుమారి, అధికారులు ఉన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

జలుమూరు/సారవకోట: అంగన్‌వాడీ సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని స్త్రీ సంక్షేమశాఖ పీడీ ఐ.విమల అన్నారు. శనివారం జలుమూరు మండలంలోని చిన్నదూగాం అంగన్‌వాడీ కేంద్రం, సారవకోట మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పూర్వప్రాథమిక విద్యను మెరుగుపరచాలన్నారు. ప్రతీరోజు విధిగా మెనూ పాటించాలని, ,రికార్డుల నిర్వహణలో అలసత్వం ఉండకూడదన్నారు. సీడీపీఓ వంశీప్రియ, నోడల్ అధికారి మణి పాల్గొన్నారు.

విచారణకు సహకరించని సర్పంచ్



విచారణ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ వసంతకుమారి

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామ పంచాయతీ సర్పంచ్ మీసాల వనితపై అదే గ్రామానికి చెందిన బూరాడ కమలహాసన్‌తోపాటు పలువురు జిల్లా కలెక్టర్‌కు, డీపీఓకు ఇటీవల ఫిర్యాదు చేశారు. పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా వార్డు మెంబర్ల ఖాతాల్లోకి సర్పంచ్ జమ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిప్యూటీ ఎంపీడీఓ వసంతకుమారి శనివారం గ్రామ సచివాలయంలో విచారణ చేపట్టారు. విచారణకు హాజరైన సర్పంచ్ ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై విచారణ జరపుతుండగా.. సమాధానాలు ఇవ్వకుండా అన్ని పంచాయతీల్లోనూ ఇలాగే జరుగుతుందని వాగ్వాదానికి దిగారు. విచారణ మధ్యలోనే సర్పంచ్ వెళ్లిపోయినట్లు డిప్యూటీ ఎంపీడీఓ తెలిపారు. విచారణకు సర్పంచ్ సహకరించలేదని ఎంపీడీఓకు నివేదించడం జరిగిందన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

కొత్తూరు: మండలంలో కడుము కాలనీకి చెందిన మంతెన అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి టెక్కలి డీఎస్పీ దర్యాప్తు నిర్వహించారు. కడుము కాలనీకి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు వలురౌతు గోవిందరావుతోపాటు ఐదుగురు వ్యక్తులు కులం పేరుతో దూషించినట్లు అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పారావుతోపాటు ఫిర్యాదులో పేర్లు ఉన్న వారిని డీఎస్పీ విచారణ చేపట్టారు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ ఉన్నారు.

రెండు సబ్ రేషన్ డిపోలు మంజూరు

హిరమండలం: మండలంలోని రెండు గిరిజన గ్రామాలకు సబ్ రేషన్ డిపోలు మంజూరైనట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని పెద్దగూడ పంచాయతీ పరిధిలో పాండ్రు మానుగూడ, మర్రిగూడ పంచాయతీ పరిధిలోని దబ్బగూడకు సబ్ రేషన్ డిపోలు మంజూరయ్యాయన్నారు. వీటి ద్వారా గిరిజనులకు రేషన్ సరుకులు అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



కారును తనిఖీ చేస్తున్న సీఐ సన్యాసినాయుడు

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో పాతపట్నం సీఐ ఎస్.సన్యాసినాయుడు, సిబ్బంది శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేపట్టారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. సరిహద్దులో ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర రికార్డులు లేకుండా తిరుగుతున్న వారిపై జరిమానా విధించామన్నారు. ఎస్ఐ బి.లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు సరికాదు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్



ఆమదాలవలస: బాధితులను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: హత్యా రాజకీయాలు చేయడం కూటమి ముఠాలకు సబబు కాదని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని కొత్తవలసలో ఇటీవల జరిగిన ఘర్షణలో మృతి చెందిన అరసవిల్లి హరిమ్మ కుటుంబ సభ్యులను, ఘర్షణలో గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బురద శ్రీనివాసరావు, బురద రాజు, బురద శేఖర్, బురద లక్ష్మణను శనివారం పరామర్శించారు. దాడికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశామని కక్ష కట్టి వినాయక నిమజ్జన కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని బాధితులు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేవరకు ఎంతటివారినైనా విడిచిపెట్టేది లేదని రవికుమార్ హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో కొత్తవలస వైస్ ప్రెసిడెంట్ గురుగుబెల్లి అప్పలనాయుడు, నాయకులు బొడ్డేపల్లి మన్మథరావు, పైడి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

పొందూరు: మండలంలోని పలు కుటుంబాలను చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. శ్రీకాకుళంలోని కిమ్స్‌లో దళ్లవలసకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లాన వెంకటరమణను, చికిత్స పొంది వచ్చిన మొకరబాలరాజును కేసవదాసుపురంలో పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, నాయకులు మజ్జి గోపాలకృష్ణ, మొకర శంకర్, చిరంజీవి ఉన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం

- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చిరంజీవినాగ్



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: పేదలకు వైద్య విద్య, వైద్యాన్ని దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ ఆరోపించారు. ఆమదాలవలస పట్టణంలోని స్వగృహంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారన్నారు. కూటమి సర్కారు వీటిని ప్రైవేట్‌పరం చేస్తోందని, మరోవైపు ఆరోగ్యశ్రీని కూడా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తోందన్నారు. 2023–24లో విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయన్నారు. 2024–25లో మరో ఐదు కొత్త మెడికల్ కాలేజీలు ప్రారంభమైతే రాష్ట్రంలో 2,360 నుంచి 4910 మందికి ఎంబీబీఎస్ సీట్లు పెరిగేవన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అదనపు మెడికల్ సీట్ల ద్వారా ఎంతో మేలు జరిగేదన్నారు. ఒక్క పాడేరు మెడికల్ కాలేజీని మాత్రమే ప్రారంభించి, మిగిలిన నాలుగు కాలేజీలను ప్రారంభించకుండా సీట్లు వద్దంటూ కేంద్రానికి కూటమి ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. మిగిలిన రాష్ట్రాలన్నీ మెడికల్ సీట్లు ఇవ్వాలని కేంద్రాన్ని వేడుకుంటుంటే.. కూటమి సర్కారు సీట్లు వద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాసి నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను సేఫ్ క్లోజర్ పేరుతో మూత వేసిందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంజీవని వంటి ఆరోగ్యశ్రీని కూడా చంద్రబాబు బతకనివ్వడంలేదన్నారు. ఈ 15 నెలల కాలంలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇవ్వాల్సిన రూ.4,500 కోట్లకు కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. ఈ రాష్ట్రానికి ఎందుకు ద్రోహం చేస్తున్నారో సీఎం చంద్రబాబు చెప్పాలని ప్రశ్నించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

హిరమండలం: మండలంలోని ప్రైవేట్ లైసెన్స్ ఎరువుల దుకాణాల్లో అధిక ధరలకు ఎరువులు, రసాయన మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తూరు వ్యవసాయశాఖ ఉప సంచాలకులు రాజగోపాల్ హెచ్చరించారు. శనివారం పలు ఎరువుల దుకాణాలను రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎరువుల సమస్యలపై ఫిర్యాదు కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ నంబర్ 9121863788ను సంప్రదించాలన్నారు. నరసన్నపేట ఏఓ బి.సంధ్య మాట్లాడుతూ.. మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారన్నారు. రైతులు మూడు దశలలో ఎరువులు వాడుతుంటారన్నారు. వీటికి 600 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని, ఇప్పటివరకు (రెండో దశ) 400 మెట్రిక్ టన్నుల ఎరువు రైతులకు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతానికి వరి దుబ్బుకట్టే దశలో ఉందని, మరో 15 రోజులకు మూడో దశ ఎరువు అవసరం అవుతుందన్నారు. వారం రోజుల్లో మరో 200 మెట్రిక్ టన్నుల ఎరువులు వస్తాయన్నారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్‌రావు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు..

ఆమదాలవలస: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో శనివారం సాయంత్రం విజిలెన్స్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. అన్ని దుకాణాల్లోనూ నేమ్ బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. తహసీల్దార్ ఎస్.రాంబాబు, ఏఓ మెట్ట మోహన్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పొందూరు: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పొందూరు సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అడ్డుకోవాలంటే బాలికలకు ఆత్మరక్షణపై శిక్షణ అవసరమన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవడంలో బాలికలే కీలకపాత్ర పోషించాలన్నారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

పరామర్శ..



సారవకోట: కిన్నెరవాడలో రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు



ఆమదాలవలస: అరసవిల్లి హరమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

సారవకోట: మండలంలోని పలు కుటుంబాలను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య శనివారం పరామర్శించారు. ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన యామల లక్ష్మణరావు, కరుసోదు అప్పారావు, గొ్రిబంద గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు పోతుమహంతి షణ్ముఖరావు, అలుదు గ్రామానికి చెందిన తుంగాన ప్రియాంక మృతి, కిన్నెరవాడలో ధర్మాన రామ్మూర్తి ఇటీవల మృతి చెందడటంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, పార్టీ నాయకులు రావాడ శ్రీనివాసరావు, యడ్ల రంగారావు, సర్పంచ్‌లు కొండాల బాబూరావు, సాగిపల్లి దండాశి తదితరులు ఉన్నారు.

కొత్తవలసలో..

ఆమదాలవలస: మండలంలోని కొత్తవలస గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ శనివారం పరామర్శించారు. ఇటీవల వినాయకుని నిమజ్జనంలో జరిగిన ఘర్షణలో మృతి చెందిన అరసవిల్లి హరమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. బాగాది వరహాలు కుమార్తె రాములమ్మ పోలీస్ ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైస్ సర్పంచ్ గురుగుబెల్లి అప్పలనాయుడు, ఎంపీటీసీ కూటికుప్పల సన్యాసిరావు, పార్టీ నాయకుడు బొడ్డేపల్లి మన్మథరావు ఉన్నారు.